సాక్షి
వనపర్తి
శనివారం ♦ 8 ♦ ఏప్రిల్ ♦ 2023



మెరిసిన మన పల్లెలు

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకెళ్లిన ఆ పల్లెలకు జాతీయ అవార్డులు వరించాయి.

వివరాలు 10లో ▸



వెళ్లొస్తాం.. లింగమయ్య

నల్లమలలో కొనసాగిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.2 /23.1

రోజంతా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళలలో ఆకాశం తేలికపాటి మేఘావృతమై ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-37
(శనివారం సాయంత్రం)

సహర్ 4-44
(ఆదివారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి

వనపర్తి టౌన్: వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు మున్సిపాలిటీ ట్యాంకర్‌తో నీళ్లు పట్టాలని, ప్రజలందరూ మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం వాటర్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించి, ట్యాంకర్‌తో నీరు పట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణంలో అధిక మొక్కలు నాటి, వాటికి నీరు పోసి సంరక్షించాలని సూచించారు. ప్రజలు ప్రతి మొక్కను కుటుంబ సభ్యుల్లో ఒకరన్నట్లు చూసుకుంటే పచ్చదనంలో ముందుంటామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్?

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని ముగ్గురు కానిస్టేబుళ్లపై తాజాగా సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. ఓ కేసు విషయంలో తలదూర్చారని పోలీసుల విచారణలో తేలడంతో ఏఎస్ఐ మన్యపురెడ్డి, కానిస్టేబుళ్లు నవీన్‌గౌడ్, శ్రీనును సస్పెండ్ చేసినట్లు వినికిడి. ఈ ముగ్గురిని గద్వాల డీఐజీ చౌహాన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ రక్షితమూర్తిని వివరణ కోరగా.. సస్పెండ్ అయినట్లు సమాచారం తెలిసిందని తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వనపర్తి క్రైం: ప్రతిఒక్కరికీ ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని.. తప్పనిసరిగా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనువాసులు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక శ్రమలేని మనిషి 60శాతం చక్కెర, రక్తపోటు, క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడని, విధిగా కాలినడక, యోగ అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సౌభాగ్య లక్ష్మి, రాంచంద్రరావు, ఇస్మాయిల్, ఇందిర పాల్గొన్నారు.

సంత స్థల వివాదం కొలిక్కి

పెబ్బేరు: పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సంత స్థల విషయంలో వివాదం కొనసాగుతుండగా.. ఎట్టకేలకు 16 ఎకరాల భూమిని మున్సిపాలిటీకి చెందినట్లు శుక్రవారం పాలకవర్గం ప్రకటించింది. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ మాట్లాడుతూ.. పట్టణంలోని వేణుగోపాలస్వామి భూమి 30ఎకరాల 19 కుంటలు భూమిలో ప్రతి శనివారం సంత నిర్వహిస్తుండగా ఆ భూమిని అలయ పూజారులు గతంలో ఓఆర్‌సీ తీసుకొచ్చి ధరణి చేశారు. దీంతో దేవాదాయ శాఖ వారు కోర్టులో కేసు వేయడంతో ఏళ్లుగా కోర్టులో ఈ భూమిపై వివాదం నడుస్తున్న క్రమంలో పూజారులకే తీర్పు వచ్చిందని తెలిపారు. పట్టణానికి సంత, దాని నుంచి వచ్చే ఆదాయం ప్రధానం కావడంతో అట్టి స్థలం సంతకే కేటాయించాలని మున్సిపల్ పాలక వర్గం మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి భూమికి సంబంధించిన పూజారులతో మాట్లాడి మొదటగా 12ఎకరాల 28 కుంటల భూమిని, ఆ తర్వాత 3.12 ఎకరాల భూమిని శాశ్వతంగా ఇప్పించేందుకు కృషి చేశారన్నారు. ఇక సంతలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ ఎల్లారెడ్డి, సుమతి, పార్వతిగౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

వనపర్తి క్రైం: రాష్ట్ర విభజన చట్టం ద్వారా దక్కాల్సిన హక్కులు, వాటాలను నిరాకరిస్తూ, సింగరేణి లాంటి సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రం పూనుకుంటుందని, రాష్ట్రానికిఅన్యాయం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రధాని మోదీ ఈనెల 8న తెలంగాణ రాకను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని పేర్కొన్నారు.

మార్గం.. సుగమం

శరవేగంగా కల్వకుర్తి- కొల్లాపూర్- నంద్యాల జాతీయ రహదారి పనులు



కొల్లాపూర్ వద్ద జాతీయ రహదారి కోసం డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న కన్సల్టెంట్ సంస్థ (ఫైల్)

- రెండు తెలుగు రాష్ట్రాలు కలుపుతూ సాగనున్న నిర్మాణం
- హైదరాబాద్- తిరుపతికి మధ్య తగ్గనున్న దూరభారం
- ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయం
- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని నరేంద్రమోదీ

జాతీయ రహదారి నం. : 167(కె)
మొదటి విడతలో చేపట్టనున్న రోడ్డు : 86 కి.మీ.,
కేటాయించిన నిధులు : 629.96 కోట్లు
హైదరాబాద్- తిరుపతి మధ్య తగ్గనున్న దూరం : 70 కి.మీ.,

అచ్చంపేట: కొత్త జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా సాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాలను కలుపుతూ ఏర్పాటవుతున్న ఈ రహదారి వల్ల రూపురేఖలు మారనున్నాయి. ఇందులో భాగంగా 2020లో కల్వకుర్తి- కొల్లాపూర్- నంద్యాల 167కె నంబర్ కేటాయిస్తూ జాతీయ రహదారిగా గుర్తించారు. 2021- 22 బడ్జెట్‌లో పరిపాలన అనుమతులు లభించగా.. మొదటి విడతగా కొట్ర నుంచి మల్లేశ్వరం వరకు 86 కి.మీ., రహదారి నిర్మాణానికి రూ.629.96 కోట్లు కేటాయించారు. ఈ మేరకు రెండు నెలల క్రితమే టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. ఈ క్రమంలోనే శనివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల్వకుర్తి (కొట్ర) నుంచి నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా నంద్యాల వరకు ఏర్పాటు కానున్న రహదారి నిర్మాణానికి శనివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.

తిరుపతికి మరోమార్గం..

కొత్త జాతీయ రహదారి నిర్మాణం వల్ల హైదరాబాద్ నుంచి తిరుపతికి చేరుకునేందుకు మరోమార్గం ఏర్పాటు కాబోతుంది. దీని వల్ల హైదరాబాద్- తిరుపతి మధ్య 70 కి.మీ., మేర దూరం తగ్గనుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి తిరుపతికి షాద్‌నగర్, జడ్చర్ల, కొత్తకోట, పెబ్బేరు, కర్నూలు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కొత్త జాతీయ రహదారి నిర్మాణంతో హైదరాబాద్ నుంచి ఆమనగల్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా ఏపీలోని ఆత్మకూర్, నంద్యాల మీదుగా తిరుపతి చేరుకోవచ్చు. ఈ మార్గంతో దూరం తగ్గడంతోపాటు సమయం కూడా కలిసి వస్తోంది. ఈ మార్గంలో బైపాస్ రోడ్లు, జంక్షన్లు, అండర్ పాస్‌లు నిర్మించనున్నారు.

ముందుగా కొల్లాపూర్ బైపాస్..

కొత్త జాతీయ రహదారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పాత రోడ్డు, బైపాస్‌లు నిర్మాణం జరిగే ప్రాంతాలను ఇప్పటికే ఒక దఫా పరిశీలించారు. అయితే మొదట కొల్లాపూర్ బైపాస్ నుంచి పనులు మొదలుపెట్టాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్టర్ మాత్రం నాగర్‌కర్నూల్ నుంచి రోడ్డు మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. భూసేకరణ పూర్తయ్యి బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తే.. కొల్లాపూర్ నుంచే పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. పరిహారం ఇప్పించి ఇక్కడి నుంచి రోడ్డు పనులు మొదలు పెట్టించే పనిలో ఎమ్మెల్యే ఉన్నారు. ఇందుకు సంబంధించి పొలాల్లో ఉండే బోర్లు, బావులు, చెట్లు, ప్లాట్ల వివరాలపై సర్వే కొనసాగుతోంది.

చివరి దశలో భూసేకరణ

కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ బైపాస్‌ల భూసేకరణ తుదిదశకు చేరుకుంది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన 362.902 ఎకరాల భూమిని సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే భూ సేకరణ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చారు. రెండో నోటిఫికేషన్ ఒకట్రెండు రోజుల్లో వెల్లువడే అవకాశం ఉంది. తదుపరి డ్రాఫ్ట్ డిక్లరేషన్ చేయాల్సి ఉంటుంది. అవార్డు ప్రకటించి పరిహారం అందజేసే అంశంపై కసరత్తు చేస్తున్నారు. పరిహారం ప్రక్రియ మొదలైతే కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టే అవకాశం ఉంది.

పారిశ్రామికంగా అభివృద్ధి



జాతీయ రహదారి, సోమశిల బ్రిడ్జితో నాగర్‌కర్నూల్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. రోడ్డు, బ్రిడ్జి ఏర్పాటు చేయాలని పార్లమెంట్‌లో ప్రస్తావించాం. నాలుగు సార్లు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందడం, ఇండ్రస్టీయల్ రావడం వల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తోంది. భూత్పూర్- మన్ననూర్- మాచర్ల, అలంపూర్- చిన్నంబావి, కొల్లాపూర్ మీదుగా అచ్చంపేట, దేవరకొండ, వనపర్తి- మంత్రాలయం, వనపర్తి- జడ్చర్ల కొత్త జాతీయ రహదారుల కోసం ప్రయత్నిస్తున్నాం.

– రాములు, ఎంపీ, నాగర్‌కర్నూల్

సంతోషంగా ఉంది..



కల్వకుర్తి- నంద్యాల జాతీయ రహదారి నిర్మాణానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉంది. ఐకానిక్ బ్రిడ్జి, టూరిజం పార్కు తెలంగాణకు కలికితురాయిగా మారనుంది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ 20 రోజుల్లో పనులు కూడా మొదలు పెడతారు. ఈ రోడ్డు ఏర్పాటుతో నాగర్‌కర్నూల్ జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తోంది. జిల్లా రూపురేఖలు మారిపోతాయి.

– వేముల నరేందర్‌రావు, బీజేపీ తెలంగాణ అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్

మారనున్న రూపురేఖలు

రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ ఆధ్యాత్మిక దారిలో వెళ్తున్న ఈ జాతీయ రహదారి నిర్మాణంతో పట్టణాలు, గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. పూర్తిగా వెనకబడిన పట్టణాలు, గ్రామాల నుంచి ఈ మార్గం వెళ్తుంది. కృష్ణానదిపై మణిహారంలా రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ మార్గంలో సోమశిల శ్రీలలిత సోమేశ్వర ఆలయం, కృష్ణానది అవతల సంగమేశ్వర క్షేత్రం, మహానంది, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలను కలుపుతూ ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ప్రకృతి అందాలు, సోమశిల తీగల వంతెనతో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయనున్నారు.

నెరవేరిన కల

అందుబాటులోకి సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ డబ్లింగ్ లైన్



సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ డబ్లింగ్, విద్యుదీకరణ లైన్

- 85 కిలోమీటర్ల మేర డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తి
- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ
- ప్రయాణికులకు ఆదా కానున్న సమయం
- వాణిజ్యపరంగా అభివృద్ధికి దోహదం

సెక్షన్ల వారీగా పూర్తయిన డబ్లింగ్ లైన్..

సెక్షన్	దూరం (కి.మీ.,)
షాద్‌నగర్- గొల్లపల్లి	30
ఉందానగర్- షాద్‌నగర్	30
దివిటిపల్లి- మహబూబ్‌నగర్	15
గొల్లపల్లి- దివిటిపల్లి	10
(పూర్తయిన విద్యుద్దీకరణ)	
ఉందానగర్- గొల్లపల్లి	60
గొల్లపల్లి- దివిటిపల్లి	15
దివిటిపల్లి- మహబూబ్‌నగర్	10

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని రైల్వే ప్రయాణికుల ఎన్నో ఏళ్ల మహబూబ్‌నగర్ డబ్లింగ్ రైల్వే కల నెరవేరింది. ఎంతో ప్రాధాన్యత గల సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ లైన్ 2015- 16లో 85 కిలోమీటర్ల నిడివిగల ఈ ప్రాజెక్టు రూ.774 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేశారు. గత ఏడేళ్ల నుంచి నుంచి ఈ లైన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించి డబ్లింగ్ రైల్వేలైన్‌ను పూర్తి చేశారు. ఉందానగర్ నుంచి ప్రారంభమైన డబ్లింగ్ రైల్వే మహబూబ్‌నగర్ వరకు పూర్తయింది. రూ.1,410కోట్ల వ్యయంతో సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ డబ్లింగ్ లైన్, విద్యుద్దీకరణ పనులు పూర్తి చేసినట్లు ఇటీవలే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ డబ్లింగ్ లైన్‌ను శనివారం హైదరాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేయనున్నారు.

సెక్షన్ల వారీగా పనులు..

ఈ ప్రాజెక్టు కింద సెక్షన్ల వారీగా స్టేషన్‌కు స్టేషన్ మధ్య డబ్లింగ్‌లైన్ పనులను చురుగ్గా చేపట్టి పూర్తి చేశారు. ఇందులో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం షాద్‌నగర్, బాలానగర్, రాజాపూర్, గొల్లపల్లి రైల్వేస్టేషన్, జడ్చర్ల, దివిటిపల్లి స్టేషన్, మహబూబ్‌నగర్ స్టేషన్‌లను అన్ని విధాలుగా ఆధునికీకరించి నూతన భవనాలు నిర్మించారు. డబ్లింగ్ పనుల్లో భాగంగా పలు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిలను కూడా నిర్మించడంతోపాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. డబ్లింగ్ పనులతో పాటు 85 కిలోమీటర్ల విద్యుద్దీకరణ పనులను కూడా పూర్తిచేశారు. రైల్వే ఉన్నతాధికారులు డబ్లింగ్ లైన్, విద్యుదీకరణ పనులను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించడంతోపాటు సెక్షన్ల వారీగా ట్రయల్‌రన్ నిర్వహించారు. డబ్లింగ్ పట్టాలపై 120 కిలోమీటర్ల స్పీడ్‌తో ప్రత్యేక రైలు ఇంజిన్ ద్వారా రన్ టెస్ట్ జరిపారు.



మోటార్‌ట్రాలి ద్వారా డబ్లింగ్ లైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

విద్యుద్దీకరణతో నిరాటంకంగా..

విద్యుద్దీకరణ వల్ల రైలు ఇంజిన్‌ను మార్చనవసరం లేకుండా ఈ మార్గాల్లో నిరాటంకంగా రైళ్లు నడిచేందుకు వీలు కలుగుతుంది. మార్గమధ్యలో ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్ల నిలుపుదల సమయం తగ్గడం వల్ల రైళ్ల సగటు వేగాన్ని మెరుగుపరుస్తుంది. సెక్షనల్ కెపాసిటీ పెంపుదల కారణంగా ఈ విభాగాల్లో మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీని వల్ల రైళ్లు పర్యావరణ అనుకూలమైన విద్యుత్ వినియోగంతో పాటు ఇంధన ఖర్చులను కూడా ఆదా చేస్తుంది.

సమయం ఆదా..

దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో రెండో పెద్దస్టేషన్ మహబూబ్‌నగర్. జిల్లా నుంచి ప్రతిరోజు 5వేల- 6వేల మంది ప్రయాణికులు ఇటు హైదరాబాద్, అటు కర్నూలు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే డబ్లింగ్‌లైన్ పూర్తయితే జిల్లా ప్రయాణికులకు వెసులుబాటు లభిస్తుంది. మహబూబ్‌నగర్ నుంచి 100 కిలోమీటర్లు దూరంలో ఉన్న సికింద్రాబాద్‌కు వెళ్లడానికి ప్యాసింజర్‌కు దాదాపు 3 గంటలు, ఎక్స్‌ప్రెస్‌కు 2 గంటల సమయం పట్టేది. అయితే డబ్లింగ్ లైన్ పూర్తయితే రైళ్ల స్పీడ్ పెంచడంతో పాటు గంట సమయం ఆదా అవుతోంది. వాణిజ్యపరంగా కూడా ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

సంతోషంగా ఉంది..



సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ డబ్లింగ్ రైల్వే లైన్ పూర్తి కావడం సంతోషంగా ఉంది. ఈ లైన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేయడం గొప్ప విషయం. డబ్లింగ్ రైల్వే లైన్ విద్యుద్దీకరణ పూర్తికావడంతో భవిష్యత్‌లో మహబూబ్‌నగర్ వరకు ఎంఎంటీఎస్ వచ్చే అవకాశం ఉంది. డబ్లింగ్ లైన్ పూర్తితో ఉమ్మడి జిల్లా రైల్వే ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు లభిస్తుంది. హైదరాబాద్ వెళ్లడానికి సమయం ఆదా అవుతుంది.


– గోపాల్ నారాయణ, డీఆర్‌యూసీసీ, మహబూబ్‌నగర్

3 రోజులు.. 3.70 లక్షలు


సలేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరొందిన నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఈ నెల ఐదో తేదీన యాత్ర ప్రారంభం కాగా.. శుక్రవారం ముగిసింది. మూడు రోజుల్లో సుమారు 3.70 లక్షల మంది భక్తులు లింగమయ్యను దర్శించుకున్నారు. తెలంగాణ, ఆంధ్రతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తండోపతండాలుగా వచ్చిన భక్తులతో సలేశ్వరం జనసంద్రమైంది. అంతేకాదు.. దట్టమైన అటవీ మార్గంలో ఎత్తైన కొండలు, లోయలు, సెలయేళ్లు, రాళ్లను దాటుకుంటూ సాగే సాహస యాత్రకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. కరోనా నేపథ్యంలో 2020, 2021లో సలేశ్వరం ఉత్సవాలు రద్దు అయ్యాయి. ఆ తర్వాత నుంచి ఉత్సవాలను మూడు రోజులకు కుదించినప్పటికీ భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తుండడం విశేషం.

నాలుగేళ్లుగా భక్తుల రాక ఇలా (అంచనా)..




ఈ మూడు రోజుల్లో భక్తుల రాక ఇలా..



‘టోల్’ @ రూ.50 లక్షలు

- అటవీ శాఖకు 3రోజుల్లో సమకూరిన ఆదాయం

సంవత్సరాల వారీగా ఆదాయం (రూ.లక్షల్లో) ఇలా (అంచనా)..



సలేశ్వరం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ క్రమంలో మన్ననూర్, ఫర్హాబాద్ టోల్‌గేట్ల ద్వారా అటవీశాఖ భక్తుల నుంచి ముక్కుపిండి టోల్ రుసుం వసూలు చేస్తోంది. ఫర్హాబాద్ చెక్‌పోస్టు నుంచి అటవీ మార్గంలో 18 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇందుకు అటవీ అధికారులు ఒక్కో ద్విచక్రవాహనానికి రూ.100, ఆటోలకు రూ.300, కార్లకు రూ.500, లారీ, డీసీఎం వంటి భారీ వాహనాలకు రూ.1,000 చొప్పున చార్జీలు వసూలు చేస్తున్నారు. వీరి లెక్కల ప్రకారం మూడు రోజుల్లో 5 వేల వరకు ద్విచక్ర, ఆటోలు, కార్లు 5 వేలు, భారీ వాహనాలు వంద వరకు వచ్చాయని.. రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు చెబుతున్నారు. కానీ.. రూ.50 లక్షలకు పైగానే ఆదాయం సమకూరినట్లు తెలుస్తోంది. సలేశ్వరం జాతరకు వచ్చిన అశేష జనవాహిని, వాహనాలే ఇందుకు నిదర్శనం. వాహనాల సంఖ్య, ఆదాయం వివరాలు ఇవ్వకుండా అధికారులు గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రంజాన్.. సుఖ సంతోషాలు నింపాలి



ముస్లింలకు రంజాన్ గిఫ్ట్‌లు అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: సహృదయ భావనతో.. సుఖ సంతోషాలతో రంజాన్ పండుగ చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రభుత్వం తరుపున పేద ముస్లింకు రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పండుగలకు సమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ముస్లింల కోసం ఇస్తున్న పండుగ కానుకను ఎంపిక చేసిన వారికి షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రమేష్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ చీర్ల సత్యం, జోహెబ్‌హుస్సేన్, రహీం పాల్గొన్నారు.

సగర ఫెడరేషన్ ఏర్పాటుకు కృషి

సగర కులస్తుల సంక్షేమం కోసం సగర ఫెడరేషన్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికైన నూతన పట్టణ కమిటీ సభ్యులు మంత్రిని కలిసి సగరుల సమస్యలను వివరించడంతోపాటు జిల్లా కేంద్రంతో పాటు ఆయా ప్రాంతాల్లో సగర కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేయించాలని కోరారు. తిరుపతయ్య, మురళి సాగర్, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతు లేనిదే జీవనం లేదు..

గోపాల్‌పేట: రైతు లేనిదే జీవనం లేదని.. వందల ఏళ్లుగా తెలంగాణ ప్రాంతం వ్యవసాయంలో ముందంజలో ఉందని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోపాల్‌పేటలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద అంతరాష్ట్ర బండలాగు పోటీలను మంత్రి ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే..

వనపర్తి క్రైం: త్యాగానికి, దయకు ప్రతీక ఏసుక్రీస్తు అని.. ప్రపంచంలోని పాపాలన్నీ తాను మోస్తానంటూ శిలువను ఎక్కాడని, ఏసుపై నమ్మకంతో ముందుకు సాగితే నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ విజయ ప్రాప్తి కలుగుతుందని పాస్టర్లు వివరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంబీ ఓలియ చర్చిలో గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ జానప్ప సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్, చైర్మన్ సుకన్య, వైస్ చైర్మన్ మార్టిన్ లూథర్, సెక్రటరీ రొనాల్డ్ తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాముడు (ఫైల్)

అచ్చంపేట రూరల్: మండలంలోని ఘన్‌పూర్‌లో శుక్రవారం మధ్యాహ్నం రాముడు(50) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తనకున్న మూడున్నర ఎకరాల్లో వేరుశనగ పంట వేశాడు. మధ్యాహ్నం తన పొలంలోని బోరు మోటారు నడవకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేయడానికి వెళ్లాడు. అకస్మాత్తుగా విద్యుదాఘాతంతో రైతు అక్కడికక్కడే కింద పడ్డాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు, కుటుంబ సభ్యులు వెంటనే నల్లగొండ జిల్లా దేవరకొండ ఆస్పత్రికి ఆటోలో తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారులు విజయ్, గణేష్, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు సిద్దాపూర్ ఏఎస్‌ఐ నర్సింహారెడ్డి కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పరామర్శించారు.

వాహనం ఢీకొని యువకుడు మృతి

మహమ్మదాబాద్: రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొకర్లాబాద్ చెందిన బుడగజంగం శివయ్య (25) బిక్షాటన చేసేవాడు. ఇదే క్రమంలో యువకుడు తాగుడుకు బానిసై గురువారం అర్ధరాత్రి రోడ్డుపై నుంచి ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియన వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి బలవన్మరణం

అలంపూర్ రూరల్: పట్టణంలోని చౌక్‌బజార్ సమీపంలో గల ఇంట్లో యువతి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ ఆలయంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస శర్మ కుమార్తె హిరణ్మయి (21) తిరుపతిలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం ఉదయం శ్రీనివాసశర్మ ఆలయానికి, తల్లి కరివేన నిత్య అన్నదానసత్రంలో విధులకు వెళ్లిపోయారు. సాయంత్రం 4గంటలకు ఇంటికి తిరిగి వచ్చి చూడగా కూతురు హిరణ్మయి ఇంట్లో లుంగీతో ఉరి వేసుకుంది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు మే నెలలో వివాహం చేసేందుకు నిశ్చయించినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి మరో యువతి..

జడ్చర్ల: రైలు కింద పడి యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన శుక్రవారం కావేరమ్మపేట, గొల్లపల్లి మధ్యలో చోటు చేసుకుంది. శుక్రవారం రైల్వే బ్రిడ్జి వద్ద 30ఏళ్లున్న గుర్తు తెలియని యువతి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని రైల్వే ఎస్‌ఐ సయ్యాద్ అక్బర్ తెలిపారు. యువతి కుడి చేతిపై మామ్, డాడ్ అని పచ్చబొట్టు ఉందని ఆయన వివరించారు. ఈ విషయంలో ఎవరైనా సమాచారం కావాలంటే 9440627522 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన తెలిపారు.

బాలికపై లైంగికదాడి

నవాబుపేట: బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన మునగాలి చెన్నయ్య బాలికలను ప్రేమపేరుతో మోసం చేసి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు తీసుకెళ్లాడు. అక్కడే పెళ్లి చేసుకోవాలనే ప్రయత్నం చేశాడు. కాగా శుక్రవారం బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వారిని పట్టుకుని మండలానికి తీసుకొచ్చారు. బాలికను మోసం చేసిన కేసుతో పాటు ఇంట్లో నుంచి కిడ్నాప్, పోక్సో కేసును అతడిపై నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

4,536 కేజీల బెల్లం పట్టివేత



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా ఎక్సైజ్ పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు చేసిన సంయుక్త తనిఖీల్లో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం భారీగా పట్టుబడింది. ఈఎస్ సైదులు ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక టీంలు గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని వీరన్నపేట పాత శివాలయం ఏరియాలోని చెలుకల కృష్ణ అలియాస్ కిట్టుకు చెందిన ఇంటితో పాటు షెడ్‌లో సోదాలు నిర్వహించారు. 283కాటన్లలో మొత్తం 4,536కేజీల బెల్లం పట్టుబడింది. ఈయన భారీగా బెల్లం నిల్వ ఉంచుతూ పట్టణ శివారులోని తండాలలో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి వెల్లడించారు.

మెరిసిన మన పల్లెలు

ఉమ్మడి పాలమూరులో రెండు జిల్లాలకు జాతీయ స్థాయి అవార్డులు

గ్రామాల్లో నిరక్షరాస్యత, పేదరికం, సామాజిక అంశాలపై అవగాహన లేకపోవడం, బాలికలు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారలోపం, నిరుద్యోగం, యువతకు ఉపాధి లేకపోవడం వంటి ఎన్నో సామాజిక రుగ్మతలను గ్రామాలు ఎదుర్కొన్నాయి. వీటన్నింటిని అధిగమించేందుకు ఆ గ్రామ సర్పంచ్‌లు, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో కష్టపడ్డారు. గ్రామసభల ద్వారా ప్రజలలో ముందుగా సామాజిక అంశాలపై కల్పించి మార్పును తీసుకొచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.


మాన్‌దొడ్డిలో ఉపాధి హామీ ద్వారా పొలాలకు వెళ్లేందుకు వేసిన రోడ్డు

రాజోళి: పేదరిక నిర్మూలనతోనే గ్రామం అభివృద్ధి సాధిస్తుందనే లక్ష్యంతో ముందుకు సాగిన మాన్‌దొడ్డి పంచాయతీకి గుర్తింపు లభించింది. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలో రెండవ మేజర్ పంచాయతీగా ఉన్న మాన్‌దొడ్డి జాతీయ పంచాయత్ అవార్డ్స్‌లో రాష్ట్ర స్థాయిలో పురస్కారం లభించింది. తాజాగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ పురస్కార్ పేరిట ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డుల్లో ద్వితీయ స్థానం రావడంపై మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హర్షిస్తున్నారు.

గ్రామ నేపథ్యం

గతంలో ఉమ్మడి వడ్డేపల్లి మండలంలో ఉన్న మాన్‌దొడ్డి గ్రామం మండలాలు విభజించాక రాజోళి మండలంలో రెండవ మేజర్ పంచాయతీగా ఉంది. ఈ గ్రామం 4,109.17 ఎకరాల్లో విస్తరించింది. 16.18 ఎకరాల్లో నివాస గృహాలు ఉండగా, ఈ గ్రామంలో ప్రధాన జీవనోపాధి వ్యవసాయం. వ్యవసాయానికి ప్రధాన వనరు ఆర్డీఎస్ కెనాల్, ఈ కెనాల్ కింద 2,304.21 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం 4,623 మంది జనాభా ఉండగా, అందులో 2,312 మంది మహిళలు, 2,311 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 2,863 మంది ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. 54.27 అక్షరాస్యతా శాతం ఉండగా, ఒక జెడ్పీహెచ్ పాఠశాలతో చుట్టూ పక్కల గ్రామాల విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుంటున్నారు.

ప్రభుత్వ పథకాల అమలు..

గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలు పూర్తి స్థాయిలో ఉంది. 90 శాతం సీసీ రోడ్లు పూర్తి కాగా, 348 ఎల్ఈడీ బల్బులు బిగించారు. మొత్తం 1,416 జాబ్ కార్డులు ఉండగా 948 మంది నిత్యం ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. ఇందులో 160 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి స్థాయిలో పాల్గొనడంతో ప్రత్యేకంగా గుర్తింపు లభించింది. మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు అందించడంలో ముందుంది. గ్రామానికి వెళ్లే దారిలో రెండు వైపులా చెట్లు నాటి, హరిత హారంలో ఇచ్చిన లక్ష్యానికి మించి పచ్చదనాన్ని పెంచడమే కాక ప్రతి రోజు నీటిని అందిస్తూ మొక్కల పెరుగుదలకు పెద్దపీట వేస్తున్నారు.

తొమ్మిది అంశాల్లో..

2021–22కి గాను రాష్ట్ర స్థాయిల్లో తొమ్మిది అంశాల్లో పంచాయతీలను ఎంపిక చేశారు. ప్రధానంగా పేదరిక నిర్మూలన జీవన ప్రమాణాల పెంపుదల విభాగంలో మాన్‌దొడ్డి ఎంపికైంది. గ్రామంలో వీటి లక్ష్య సాధన కోసం సర్పంచ్, ప్రజాప్రతినిధులతో పాటు గ్రామంలోని యువజన సంఘాలు, రైతు సంఘం కూడా తమ వంతు తోడ్పాటును అందించాయని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం కల్పించే ప్రతి పథకంలో వీరు చురుగ్గా పని చేశారు. గ్రామంలో 29 మహిళా సంఘాలు ఉండగా, గ్రామీణ వికాస్ బ్యాంకు ద్వారా సేవలందడం, మహిళా సంఘాలకు రుణాలు అందాయి.

ఈ ఘనత మా గ్రామ ప్రజలదే..



రాష్ట్ర స్థాయిఅవార్డు రావడంతో చాలా సంతోషించాం. తాజాగా జాతీయ స్థాయిలో కూడా మా గ్రామం ఎంపిక కావడం అంటే అది గ్రామస్తుల సహకారమే. మేము చేసే ప్రతి కార్యంలో వారి సహకారం మరువలేం. ఉపాధి హామీ పనుల నుంచి, గ్రామంలో స్వచ్ఛ వాతావరణం నెలకొల్పే వరకు ప్రతి అంశంలో అందరి సహకారం ఉంది.

– సవారి, సర్పంచ్, మాన్‌దొడ్డి

పొలాలకు వెళ్లేందుకు రోడ్లు..



గ్రామంలో చాలా వ్యవసాయ భూములకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదని గ్రామస్తులు చెప్పారు. అలాంటి భూములకు ప్రస్తుతం ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు వెళ్లే విధంగా రోడ్లను వేశాం. అవి కూడా ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించి, అభివృద్ధి చేశాం. ఇలా కూలీలకు పని ఇస్తూ, జీవన ప్రమాణాలు పెంచడం వల్ల అవార్డు లభించింది. పథకాలను సద్వినియోగపర్చడంలో ప్రజలు కూడా కీలక పాత్ర పోషించారు. ఈ అవార్డు రావడం అందరికి సంతోషంగా ఉంది.

– గోవిందురావు, ఎంపీడీఓ, రాజోళి

- సామాజిక భద్రతలో హన్వాడ మండలం కొండగట్టుపల్లి ప్రథమం
- పేదరిక నిర్మూలన జీవన ప్రమాణాల పెంపుదల విభాగంలో రాజోళి మండలం మాన్‌దొడ్డికి ద్వితీయ స్థానం
- ఇప్పటికే రాష్ట్రస్థాయిలో పురస్కారాలు

సామాజిక భద్రతలో ఆదర్శం..

హన్వాడ: చుట్టూ కొండలు.. పచ్చని ప్రకృతి మధ్య గట్టు అంచున నెలకొన్నది కొనగట్టుపల్లి గ్రామం. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రానికి కూతవేటు దూరాన ఉన్న ఈ గ్రామం వంద శాతం సామాజిక భద్రతను సాధించి జాతీయ స్థాయిలో అవార్డును సొంతం చేసుకుంది. 1,665 జనాభా, 421 కుటుంబాలు ఉన్నాయి. సర్పంచ్ మానస ఆధ్వర్యంలో 4ఏళ్లలో వార్డ్ కమిటీ, పంచాయతీ కార్యదర్శి, ప్రజల భాగస్వామ్యంతో, సమ్మిళిత అభివృద్ధిని సాధించేందుకు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. వంద శాతం సామాజిక భద్రతను సాధించేందుకు పక్కాగా ప్రణాళిక రూపొందించుకోవడమే కాకుండా, గ్రామసభల ద్వారా ప్రజలలో అవగాహన కల్పించారు.రాష్ట్రంలోనే 'వందశాతం సామాజిక భద్రత సాధించిన గ్రామంగా కొనగట్టుపల్లి మొదటి స్థానాన్ని చేజిక్కించుకుంది. ప్రస్తుతం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రహదారులు, మరుగుదొడ్లు, తాగునీరు, పార్కులు ఇలా అన్నీ మౌలిక సదుపాయాలున్నాయి.


కొనగట్టుపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్

రూ.50లక్షలతో అభివృద్ధి పనులు..

గ్రామంలో సాంఘిక సంక్షేమ కార్యక్రమాల కింద రూ.50లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టారు. 162 మందికి ఆసరా పింఛన్లు, 9మంది దివ్యాంగులను సదరంలో నమోదు చేయించడం, 1,340 మందికి ఆయుష్మాన్, ఆరోగ్యశ్రీలో నమోదు చేశారు. వీటితో పాటు 144మంది మహిళలు, గర్భిణులు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈజీఎస్ ద్వారా 248 మంది స్థానికంగా పనులు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో చిన్నారులు మొదలుకుని మహిళలు, కిశోరబాలికలు, వృద్ధులు, అన్ని వర్గాల ప్రజలు నూరు శాతం సామాజిక భద్రతా ఫలితాలను అనుభవిస్తున్నారు.

రూ.30లక్షల నజరానా : మంత్రి

సామాజిక భద్రతా అంశంలో జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైన కొనగట్టుపల్లికి ప్రోత్సాహకంగా రూ.30లక్షల నజరానాను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. తన నియోజకవర్గంలోని గ్రామానికి జాతీయస్థాయిలో అవార్డు రావడంతో మంత్రి శుక్రవారం సర్పంచ్ మానసకు అభినందనలు తెలిపారు. అందరిలా పనిచేయడం కాదని, భిన్నంగా ఉండాలనే ఆలోచన ఉన్నప్పుడే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయన్నారు. నజరానాగా రూ.30లక్షలు మంజూరు చేస్తున్నానని, నిధులతో గ్రామంలో పెద్ద కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయాలని సూచించారు. అభివృద్ధికి మరిన్ని అదనపు నిధులు మంజూరు చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అవార్డు సాధించిన పంచాయతీ పాలకవర్గాన్ని, అధికారులను ఈనెల 10న సన్మానిస్తున్నట్లు ప్రకటించారు.


చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి



కొనగట్టుపల్లి పంచాయతీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడం చాలా సంతోషం. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ అవార్డు దక్కుతుంది. జిల్లాకు గతంలో, ఈఏడాది జాతీయ స్థాయిలో అవార్డు రావడం అభినందనీయం. ఇందుకు కృషి చేసిన వారందరినీ అభినందిస్తున్నా. మిగతా పంచాయతీలు కూడా కొనగట్టుపల్లిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి.

– రవినాయక్, కలెక్టర్, మహబూబ్‌నగర్

జన్మ ధన్యమైంది



మా గ్రామానికి జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషం. నేను సర్పంచ్‌గా ఉండడం నాజన్మ ధన్యమైంది. అందరం కలిసికట్టుగా పని చేయడం వల్లనే ఇది సాధ్యమైంది. మండల, జిల్లాస్థాయి అధికారుల తోడ్పాటు, గ్రామానికి వచ్చిన నిధులు, సక్రమంగా ఉపయోగపడేలా చేశాం. జాతీయస్థాయి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– మానస, సర్పంచ్, కొనగట్టుపల్లి

ప్రజలు, అధికారుల సహకారంతో



గ్రామస్తులు, అధికారుల సహకారంతో ఈ అవార్డు వచ్చింది. ముఖ్యంగా గ్రామంలో ఆసరా పింఛన్లు, సదరం ధ్రువపత్రాలు లేనివారికి కూడా అందరికీ దరఖాస్తులు చేయించి ఇప్పించాం. అంతేకాక అంగన్‌వాడీ, పాఠశాల ఇతర సేవలన్నింటినీ గ్రామస్తులకు అందేలా చూశాం. గ్రామస్తుల సహకారం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల తోడ్పాటు అవార్డు రావడానికి తోడ్పాటు అందించాయి.

– శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

సమష్టి కృషితోనే



కొనగట్టుపల్లికి వంద శాతం సామాజిక భద్రత సాధించిన పంచాయతీగా అవార్డు రావడం సంతోషం. అధికారుల నిరంతర కృషి, జిల్లా అధికారుల ప్రోత్సాహం, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారం, సమష్టి కృషితో గ్రామానికి జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు సాధించిపెట్టింది.

– ధనుంజయగౌడ్, ఎంపీడీఓ

ఘనంగా బావాజీ రథోత్సవం


పూజాసామగ్రి తీసుకొస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- వివిధ రాష్ట్రాల నుంచి తరలొచ్చిన గిరిజనులు
- తలనీలాలు సమర్పించిన భక్తులు

మద్దూరు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో గురులోకమాసంద్(బావాజీ) రథోత్సవం కనుల పండుగగా శుక్రవారం తెల్లవారుజామున సాగింది. రథోత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి గిరిజనులు వేలాదిగా తరలివచ్చారు. గురువారం రాత్రి నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. గిరిజనుల నృత్యాలు, భజనలు చేస్తూ ప్రభువును ఆరాధించారు. తెల్లవారుజామున 4గంటలకు పూజారులు గోపాల్‌నాయక్, సోమనాథ్ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు చేశారు. రథాన్ని ఆలయ ముఖద్వారం నుంచి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు భక్తులు లాగారు. ఉదయం నుంచి గురులోకామాసంద్‌ప్రభు, కాళీకదేవికి భక్తులు బెల్లంతో చేసినా నైవేద్యాన్ని నివేదన చేశారు. బావాజీకి భక్తులు తలనీలాలు సమర్పించారు. కోరికలను తీర్చాలని తమ ఇంటి నుంచి తీసుకొచ్చిన వివిధ రంగుల జెండాలను స్తంభానికి కట్టారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసినా బంజార సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. పూణెకు చెందిన గిరిజనులు పెద్ద ఎత్తున్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బావాజీ ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురులోకామాసంద్ ప్రభు జాతరకు స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కలిసి లోకామాసంద్ ప్రభు, కాళీకదేవిలను శుక్రవారం మంత్రి దర్శించుకున్నారు. అనంతరం గిరిజన అతిథి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జాతరలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆయన మాట్లాడారు.. దేశంలో గిరిజనలు ఆరాధ్య దైవంగా కొలిచేది సేవాలాల్ మహారాజ్, మరోకరు ఇక్కడున్న గురులోకామాసంద్ ప్రభు(బావాజీ)నే అని తెలిపారు. సేవాలాల్ జయంతిని వేడుకలను ప్రభుత్వం అధికారికంగా చేపట్టింది మా ప్రభుత్వంలోనే అని చెప్పారు. ఈ ప్రాంతానికి పాలమూరు ఎత్తిపోతల ద్వారా సాగునీటిని తీసుకొస్తామని అన్నారు. ఇప్పటికే దాదాపు 70 నుంచి 80 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. కాల్వలు తవ్వి నీటి తీసుకురావడమే మిగిలిందన్నారు. అలాగే కొయిలకొండ మైసమ్మ ఆలయం నుంచి మద్దూరు వరకు డబుల్ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. జాతర వద్ద వాగుపై రూ.6.5 కోట్లతో చేపట్టే పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు తెలిపారు. భక్తులకు కోసం కనీస వసతులు ఏర్పాటుకు కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఆదేశిస్తే తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికను చేశామన్నారు. ఆలయ ఆవరణలో వివాహ వేడుకలు చేసుకునేలా పెద్ద షెడ్డును వెంటనే నిర్మిస్తామన్నారు. ఈ జాతరను రాష్ట్ర జాతరగా ప్రకటించడానికి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి సీఎంకు వివరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతేడాది జాతరలో భక్తులకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. లక్షలాది మంది గిరిజన భక్తులు వచ్చే ఈ జాతరకు కాటేజీలు, షెడ్ల నిర్మాణం చేపట్టాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్‌నాయక్, సోమనాథ్, పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రాంచందర్, డీపీఓ మురళీ, నాయకులు బాల్‌సింగ్‌నాయక్, వీరారెడ్డి, సర్పంచ్ మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖడ్గ ప్రదర్శన చేసిన ఆర్డీఓ, తహసీల్దార్

నారాయణపేట ఆర్డీఓ రాంచందర్‌నాయక్, కొత్తపల్లి తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ శుక్రవారం తెల్లవారుజామునా రథోత్సవంలో భాగంగా ఖడ్గ ప్రదర్శన చేశారు. రథోత్సవం ప్రారంభానికి ముందు గిరిజను కత్తులతో ప్రదర్శించడం ఆనవాయితీ. ఈ ప్రదర్శన అక్కడి వచ్చిన భక్తులను ఆకర్షించింది.


కత్తితో విన్యాసాలు చేస్తున్న ఆర్డీఓ రామ్‌చందర్‌నాయక్


ఆలయ ధ్వజస్తంభం వద్ద నైవేద్యాన్ని సమర్పిస్తున్న భక్తులు


బావాజీని దర్శించుకుంటున్న భక్తులు

నెలలు నిండకుండానే గర్భిణికి ఆపరేషన్

- చికిత్స పొందుతూ శిశువు మృతి
- కుటుంబ సభ్యుల ఆందోళన

అచ్చంపేట రూరల్: నెలలు నిండకుండానే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడంతో చికిత్స పొందుతూ శిశువు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బల్మూర్ మండలం చెన్నారంకు చెందిన కవిత, బాలరాజు దంపతులకు పదేళ్ల క్రితం వివాహైంది. కవిత 8నెలల క్రితం గర్భం దాల్చడంతో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుంటుంది. ఈనెల 4న ఆస్పత్రికి వచ్చిన కవిత అస్వస్థతకు గురికావడంతో పూర్తి స్థాయిలో పరీక్షించిన వైద్యులు స్రవంతి, ప్రశాంత్‌నాయక్ వెంటనే ఆపరేషన్ చేయాలని, కడుపులోని శిశువు హార్ట్‌బీట్ 50శాతమే కొట్టుకుంటుందని, లేకుంటే ఇద్దరి ప్రాణాలకు అపాయం ఉంటుందని చెప్పారు. దీంతో కవిత భర్త బాలరాజు ఆపరేషన్ చేయడానికి ఒప్పుకున్నాడు. ఇదంతా వైద్యులు వీడియో రికార్డు చేయించారు. ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. శిశువు పరిస్థితి విషమంగా ఉందని వెంటనే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాలని చెప్పారు. రెండు రోజుల పాటు చికిత్స చేయించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ తీసుకెళ్తుండగా శిశువు మృతి చెందింది. శుక్రవారం పట్టణానికి వచ్చిన కుటుంబసభ్యులు వైద్యుడు ప్రశాంత్‌నాయక్‌తో గొడవకు దిగారు. నెలలు నిండకుండా ఆపరేషన్ చేయడం వల్లే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. ఈ విషయంపై వైద్యుడు కొంత డబ్బును ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాలికల వసతి గృహంలో యువకుల హల్‌చల్

మిడ్జిల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు చొరబడ్డారు. ఆ సమయంలో 35 మంది విద్యార్థినులు భవనంలో ఉన్నారు. కాగా రాత్రి 12:30 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు ఇద్దరు యువకులు తలుపులు కొట్టి, రాళ్లు విసిరినా రాత్రి డ్యూటీలో ఉన్న వాచ్‌మన్ కనీసం పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. శుక్రవారం సాయంత్రం విషయం బయటకు వచ్చింది. దీనిపై వార్డెన్ యశోదను వివరణ కోరగా, తనకు సంఘటన గురించి తెలియదని, ఇప్పుడే విద్యార్థులు చెప్పారని సమాధానం చెప్పారు. ఈ సంఘటనపై ఎస్ఐ వెంకట్‌రామ్‌నాయక్ మాట్లాడుతూ.. శుక్రవారం సాయంత్రం వార్డెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రి మీద దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు

- జోగుళాంబ జిల్లాలో ఘటన


నాగమ్మ (ఫైల్)

శాంతినగర్: వేపచెట్టు నరకవద్దని చెప్పడంతో గొడ్డలితో కన్నతండ్రిపై దాడి చేయబోతుంటే అడ్డొచ్చిన తల్లిని నరికేశాడు ఓ కొడుకు. తీవ్రంగా గాయపడిన తల్లి అక్కడికక్కడే మృతి చెందింది. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కృష్ణజడ రాముడు, నాగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, నలుగురు కూతుళ్లు. చిన్న కుమారుడు ప్రేమరాజ్ ఎనిమిదేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో పది రోజుల క్రితం ప్రేమరాజ్ రామాపురానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో తల్లి నాగమ్మను డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించేవాడు. గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకొంటుండగా ప్రేమ్‌రాజు ఇంటిముందున్న వేప చెట్టును నరికేందుకు ప్రయత్నించాడు. తండ్రి వద్దని వారించడంతో వెంటనే గొడ్డలితో తండ్రిపై దాడి చేయబోయాడు. ఆ సమయంలో తల్లి అడ్డుపడగా గొడ్డలితో ఆమెపై దాడి చేయడంతో తల, చెవిపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నాగమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం అలంపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కొడుకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

8 కోచ్‌లు.. టికెట్ ధర రూ. 1,680

- ప్రధాని చేతుల మీదుగా నేడు సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం
- తొలిరోజు సాధారణ ప్రయాణికులకు అనుమతి లేదు
- రేపు తిరుపతి నుంచి మొదలుకానున్న రెగ్యులర్ సర్వీసు



సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేకు తక్కువ సమయంలోనే రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌గా అందుబాటులోకి వస్తున్న సికింద్రాబాద్–తిరుపతి సర్వీసును ప్రధాని మోదీ శనివారం ఉదయం 11:45 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అయితే తొలిరోజు సాధారణ ప్రయాణికులను అనుమతించరు. ఈ రైలు రెగ్యులర్ సర్వీసు ఆదివారం మధ్యాహ్నం 3:15 గంటలకు తిరుపతి నుంచి మొదలు కానుంది. సికింద్రాబాద్–తిరుపతి ఏసీ చైర్‌కార్ ధరను రూ. 1,680గా ఖరారు చేయగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధరను రూ. 3,080 (కేటరింగ్ చార్జీలు కలుపుకొని)గా నిర్ణయించారు. అలాగే తిరుపతి–సికింద్రాబాద్ వందే భారత్ రైల్లో ఏసీ చైర్‌కార్ ధర రూ. 1,625గా ఉండగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లోని ఏసీ చైర్‌కార్ ధర రూ. 3,030గా ఉంది. తిరుపతికి వెళ్లే ఇతర ఎక్స్‌ప్రెస్‌లతో పోలిస్తే ఈ రైల్లో టికెట్ ధరలు అధికంగా నిర్ణయించడంతో ప్రస్తుతానికి 8 కోచ్‌లనే ఏర్పాటు చేశారు. డిమాండ్ ఎలా ఉంటుందో స్పష్టత వచ్చే వరకు తక్కువ కోచ్‌లతోనే నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. శుక్రవారం నుంచి సాధారణ ప్రయాణికులకు టికెట్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ - కొన్ని సంగతులు..

- దేశంలోనే 13వ వందేభారత్ సర్వీసు
- దక్షిణ మధ్య రైల్వేలో రెండోది
- **ట్రైన్ నంబర్లు:** సికింద్రాబాద్–తిరుపతి 20701, తిరుపతి–సికింద్రాబాద్ 20702
- **రెగ్యులర్ ట్రిప్పుల్లో ఈ రైలు ఆగే స్టేషన్లు:** నల్లగొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు
- **మొత్తం కోచ్‌లు:** 8 (ఎకానమీ చైర్‌కార్ కోచ్‌లు 7, ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ కోచ్‌లు 1), రెండూ కలిపి మొత్తం సీట్లు: 530
- **ప్రత్యేకతలు:** స్లైడింగ్ డోర్స్, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 360 డిగ్రీల కోణంలో తిరిగే కుర్చీలు, ఇతర కోచ్‌లలో సెమీ స్లీపర్ స్థాయిలో తిరిగే కుర్చీలు, ఎమర్జెన్సీ అలారం బటన్, లోకో పైలట్ కేబిన్‌తో మాట్లాడే ప్రత్యేక వ్యవస్థ, సీసీ కెమెరాలు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాలు ఇవీ

సికింద్రాబాద్ టు తిరుపతి			తిరుపతి టు సికింద్రాబాద్	
అరైవల్	డిపార్చర్	స్టేషన్	అరైవల్	డిపార్చర్
-	ఉ.6:00	సికింద్రాబాద్	రా.11:45	-
7:19	7:20	నల్లగొండ	10:10	10:11
9:45	9:50	గుంటూరు	7:45	7:50
11:09	11:10	ఒంగోలు	6:30	6:31
12:29	12:30	నెల్లూరు	5:20	5:21
2:30	--	తిరుపతి	--	3:15

మానవాళికి డెంగీ ముప్పు!

వాతావరణ మార్పులతో దోమల వ్యాప్తి

- 129 దేశాలపై డెంగీ ప్రభావం!
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

సాక్షి, అమరావతి



ప్రపంచవ్యాప్తంగా మానవాళికి డెంగీ ముప్పు పొంచి ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా దోమలు, వైరస్‌ల వ్యాప్తి పెరగడమే ఇందుకు కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల వెల్లడించింది. దశాబ్దకాలంగా డెంగీ, జికా, చికున్ గున్యా వంటి ఆర్బో వైరస్‌ల వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లు భారీగా పెరిగాయని ప్రకటించింది. ఏడాదికి 100 మిలియన్ల నుంచి 400 మిలియన్‌ల వరకు ఇన్‌ఫెక్షన్ కేసులు నమోదవుతున్నాయని ప్రకటించింది. ప్రస్తుతం జనాభాలో దాదాపు సగం మందికి డెంగీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

డబ్ల్యూహెచ్‌వో వెల్లడించిన కొన్ని ముఖ్యమైన వివరాలు...

- అటవీ నిర్మూలన, పారిశుధ్యం, పట్టణీకరణ, నీటిపారుదలలో సమస్యలు దోమలవ్యాప్తికి ప్రధాన కారణం.
- ముఖ్యంగా అవపాతం(వాతావరణంలో ఉన్న నీటి ఆవిరి ద్రవీకరించడం), ఉష్ణోగ్రత పెరుగుదల, అధిక తేమ వంటివి దోమల అవాసాలకు అనుకూలంగా ఉన్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా 2000 సంవత్సరంలో డెంగీ కేసులు సుమారు 0.5 మిలియన్ నమోదవగా, 2019 నాటికి 5.2 మిలియన్లకు పెరిగాయి. 2023లోనూ ఇదే ఉధృతి కొనసాగుతోంది.
- ఈ ఏడాది దాదాపు 129 దేశాలు డెంగీ బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే 100కి పైగా దేశాల్లో డెంగీ వ్యాప్తి కనిపిస్తోంది.
- ఈ ఏడాది మార్చి చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా 4,41,898 డెంగీ కేసులు నమోదవగా, 119 మంది మరణించారు.
- చికున్ గున్యా దాదాపు అన్ని ఖండాల్లో విస్తరించింది. ప్రస్తుతం సుమారు 115 దేశాల్లో దాని ప్రభావం ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా జికా వైరస్ క్షీణించింది. అయితే మళ్లీ 89 దేశాల్లో వ్యాప్తిచెందే పరిస్థితులు ఉన్నాయి.

అన్ని భాషల్లోనూ పరీక్ష రాసే అవకాశమివ్వాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి కేటీఆర్
- సీఆర్‌పీఎఫ్‌లో హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లోనే పరీక్ష ఉండటంపై అభ్యంతరం
- రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష నిర్వహించాలని కేంద్ర హోంమంత్రికి లేఖ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు రాజ్యాంగం గుర్తించిన అన్ని అధికారిక భాషల్లోనూ పరీక్ష రాసేందుకు వీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీ రామారావు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాల కోసం కేవలం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో మాత్రమే పోటీ పరీక్షల నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కేంద్రమంత్రి అమిత్ షాకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన అమిత్ షాకు ఓ లేఖ రాశారు. సీఆర్‌పీఎఫ్ ఉద్యోగ సిబ్బంది నియామకం కోసం చేపడుతున్న ఈ పరీక్షను తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళంతో పాటు గుర్తించబడిన అన్ని అధికారిక భాషల్లో నిర్వహించాలని కోరారు. కేవలం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే ఈ పోటీ పరీక్షలను నిర్వహించడంతో తీవ్ర వివక్ష ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమంలో చదవని లేదా హిందీ ప్రాంతాలకు చెందని నిరుద్యోగ యువకులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 2020 నవంబర్ 18న ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం కేంద్ర ప్రభుత్వానికి ఇదే విషయమై లేఖ కూడా రాసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాంతీయ భాషల్లో చదువుతున్న కోట్లాది యువకుల పట్ల ఎలాంటి వివక్ష, అసమానతలు లేకుండా వారికి సమాన అవకాశాలు దక్కేలా సీఆర్‌పీఎఫ్ నోటిఫికేషన్‌కు సవరణ చేయాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఆయన ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

పేపర్ల లీకేజీలో బీజేపీ హస్తం

- బండి సంజయ్‌పై 'ఉపా'చట్టం కింద కేసు పెట్టాలి
- వచ్చే ఎన్నికల్లో సీపీఎంతో కలిసి పోటీ చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ హస్తం ఉన్నట్లుగా తాము భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్ పాత్ర బయటపడి ఉండకపోతే రోజుకో పేపర్ లీకయ్యేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఖమ్మంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎవరో ఒకరికి వాట్సాప్‌లో పేపర్ పెడితే.. ఆయన బండి సంజయ్‌కి పంపాడే తప్ప ఇందులో సంజయ్ తప్పేముందని కొందరు మాట్లాడడం గర్హనీయమని అన్నారు. ఫోన్‌లో జరిపిన చాటింగ్‌లో ఏం చేయాలి, ఎలా చేయాలి, ధర్నాలు చేయాలనే సూచనలు ఉన్నట్లుగా తెలుస్తోందని చెప్పారు. పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపే ఇలాంటి చర్యలు ఉగ్రవాద కుట్రల కంటే ప్రమాదకరమైనవి అయినందున సంజయ్‌పై ఉగ్రవాదులపై మోపే 'ఉపా'వంటి కఠిన చట్టాల ఆధారంగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, గతంలో సింగరేణిని ప్రైవేటీకరించబోమని చెప్పిన ప్రధాని.. ఇప్పుడు ప్రైవేట్ వారికి ఇచ్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఈనెల 14న హైదరాబాద్ నుంచి మొదలుపెడుతున్న యాత్ర వచ్చేనెల 14న కొత్తగూడెం చేరుకుంటుందని, ఈ సందర్భంగా లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం కలసి పోటీ చేస్తాయని కూనంనేని తెలిపారు. ఈ అంశంపై 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అన్నం కోసం తన్నులాట

టెంట్లు కూల్చి.. కుర్చీలు పగులగొట్టి.. • బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో రసాభాస


సీరోలులో ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలు కూల్చిన టెంట్లు

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం రసాభాసగా మారింది. చాలామంది భోజ నం చేయగా..సుమారు వందమంది కార్యకర్తలకు సరిపోలేదు. దీంతో కాంపల్లి, సీరోలు బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య గొడవ తలెత్తింది. కొందరు అన్నం గిన్నె, కూర గిన్నెలను లాక్కునేందుకు ప్రయత్నించగా.. మరికొందరు టెంట్లను కూలిచ్చేసి కుర్చీలను పగులగొట్టారు. పోలీసులు కల్పించుకుని కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆత్మీయ సమ్మేళనం జరిగిన స్టేజీపై నుంచి కార్యకర్తల ఘర్షణను చూసి నిర్ఘాంతపోయారు. ఈ నెల 5న అయ్యగారిపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలోనూ గ్రామస్తులు కూర గిన్నెలు, అన్నం గిన్నెలు ట్రాక్టర్‌లో ఎత్తుకెళ్లిపోయారు. రెండు ఆత్మీయ సమ్మేళనాల్లో భోజనాల విషయంలో గొడవలు జరగడం గమనార్హం.

బీజేపీలో చేరిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పార్టీలోకి ఆహ్వానించిన ప్రహ్లాద్‌జోషి, అరుణ్ సింగ్




సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బీజేపీలో చేరారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి ప్రహ్లాద్ జోషి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌లు సభ్యత్వ రసీదు అందజేసి, పార్టీ కండువా కప్పి ఆయన్ని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ.. కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవం తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఉపకరిస్తుందన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అవినీతిపై ప్రధాని మోదీ అద్భుతంగా పోరాడుతున్నారని చెప్పారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు.

వెళ్లొస్తాం.. లింగమయ్యా..

ముగిసిన సలేశ్వరం ఉత్సవాలు

- చివరి రోజు తగ్గిన భక్తుల రద్దీ
- లింగమయ్యను దర్శించుకున్న 3.70 లక్షల మంది
- చెక్‌పోస్టు మూసివేత



నల్లమలలోని సలేశ్వరం క్షేత్రంలో లింగమయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు

సాక్షి, నాగర్‌కర్నూల్/అచ్చంపేట/మన్ననూరు: నల్లమల లోతట్టు ప్రాంతంలోని సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు ముగిశాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి వాహనాలను అడవిలోకి వెళ్లకుండా అటవీ అధికారులు నిలిపివేశారు. ఈసారి ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకోవడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఏటా ఉత్సవాలను నిర్వహిస్తున్నా ఆలయం వద్ద కనీస ఏర్పాట్లు కూడా చేపట్టకపోవడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఏకకాలంలో పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తుల కోసం కనీస సౌకర్యాలు, బారికేడ్లు, కనీస భద్రతా ఏర్పాట్లు కూడా ఏర్పాటు చేయలేదు. చివరి రోజు భక్తులు తగ్గారు. సుమారుగా 60వేల మంది దర్శించుకున్నట్లు అంచనా. మూడు రోజుల్లో 3.70లక్షల మంది దర్శించుకున్నారు.

చెక్‌పోస్టు మూసివేత

శుక్రవారం రాత్రి నుంచి మన్ననూర్, పరాహాబాద్ చెక్‌పోస్టులు మూసివేశారు. గతంలో మాదిరిగానే రాత్రి 9గంటల వరకు మాత్రమే మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద శ్రీశైలం వెళ్లే భక్తులకు వాహనాల అనుమతి ఉంటుంది. సలేశ్వరం వెళ్లాలనుకునే భక్తులకు అటవీ ప్రాంతంలోకి అనుమతించరు. ఆర్టీసీ ప్రతి రోజు 20బస్సుల చొప్పున మూడు రోజుల్లో 166 ట్రిప్పులు నడిపించగలిగింది. చివరి రోజు శుక్రవారం మధ్యాహ్నం 1గంట వరకు బస్సులను నిలిపివేయాలని పోలీస్, అటవీశాఖ అధికారులు ఆర్టీసీకి ఆదేశాలు జారీ చేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా మంది అచ్చంపేట బస్టాండు నుంచి వెనుతిరిగి వెళ్లారు.


దర్శనానికి వెళ్లి వస్తున్న భక్తులు



కన్పించని వైద్య సిబ్బంది..

ఉత్సవాల సందర్భంగా రోజుకు సుమారు లక్ష వరకు భక్తులు హాజరయ్యారు. వీరిలో ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దర్శన సమయంలో కిక్కిరిసి తరచుగా తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఈ సమయంలో చాలామంది భక్తులకు ఊపిరాడకపోవడంతో సొమ్మసిల్లి పడిపోయారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాల్లో ఎక్కడా వైద్య సిబ్బంది కన్పించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. లోయలోకి చేరుకున్న భక్తులపై కొండ చరియలు, రాళ్లు మీదపడి పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారారు. ఈ సమయంలో వారికి కనీసం ప్రథమ చికిత్స చేపట్టే దిక్కు లేకుండా పోయింది.

పెరిగిన పోలీస్ బందోబస్తు..

ఉత్సవాల్లో మొదటి రెండు రోజుల్లో వంద మంది మాత్రమే పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేయగా, గురువారం చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో చివరి రోజున అదనంగా మరో వంద మందితో పోలీస్ శాఖ బందోబస్తు చేపట్టింది. అడవి లోపల చెత్త నిర్వహణ, తొలగింపు, వాహనాల ట్రాఫిక్, టోల్ టాక్స్ బాధ్యతలను అటవీ శాఖ సిబ్బంది చేపట్టగా, లోయ వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, బారికేడ్లు, భద్రత నిర్వహణను పోలీస్‌శాఖ చేపట్టింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈసారి ప్రత్యేక వ్యూహాన్ని అమలుచేశారు. ఒకసారి వంద వాహనాలను అనుమతించిన తర్వాత కాసేపు విరామం ఇచ్చి ఎదురుగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులను రెండు గంటలకు ఒకసారి అనుమతిచ్చి గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ఏర్పాట్లు చేశారు.

స్వచ్ఛంద సంస్థల వారు భక్తుల సౌకర్యార్థం మోకాళ్ల కురువ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాలు, తాగునీరు, అంబలి కేంద్రాలు తీవ్రమైన ఎండ వేడి నుంచి భక్తులు కాపాడుకోవడానికి ఎంతగానో ఉపకరించాయి. సలేశ్వరం ఉత్సవాలు మాత్రం అటవీశాఖకు మంచి ఆదాయ వనరుగా నిలిచిపోయిందనే చర్చ సాగింది.

ఇకనైనా కనువిప్పు కలిగేనా?

నల్లమల లోతట్టు ప్రాంతంలోని ఇరుకైన లోయలో కొలువుదీరిన లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులు సాహసం చేయాల్సి ఉంటుంది. సన్నని లోయ గుండా ప్రమాదకరంగా ప్రయాణించి స్వామిని దర్శించుకోవాలి. ఈ సమయంలో రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడిచిన పదేళ్లలో మొత్తం 9మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో భక్తులు గాయాల పాలయ్యారు. సాధారణంగా ఇటువంటి ప్రమాదకరమైన దర్శనీయ స్థలాల్లో విపత్తు నిర్వహణ అధికారుల ద్వారా ప్రభుత్వం రిస్క్ అసెస్‌మెంట్ నిర్వహించాల్సి ఉంటుంది. ఒకేసారి ఎంత మందిని అనుమతించాలన్న విషయంలో సర్వే చేపట్టాల్సి ఉంది. జాతర నిర్వహణపై ఉన్నతాధికారుల అలసత్వం భక్తుల పాలిట శాపంగా మారుతోంది. భవిష్యత్‌లోనైనా ప్రమాదాలు కాకుండా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. లింగమయ్య దర్శనానికి కాలపరిమితి విధించకుండా సమయం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా పరిమిత సంఖ్యలో భక్తులను లోపలికి అనుమతించేలా అవకాశం కల్పిస్తే ప్రాణనష్టం ఉండదన్న అభిప్రాయం వ్యక్తపరుస్తున్నారు.


సలేశ్వరం తీర్థంలో పోటెత్తిన జనం



ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణ, అభిషేకం చేపట్టారు. సాయంత్రం 5గంటలకు పాల ఉట్టిని పగలకొట్టే కార్యక్రమం కొనసాగింది. అనంతరం భజనమండలి చేత భజన గీతాలు తదితర కార్యక్రమాలను చేశారు. ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరై తమ మొక్కులను తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తాగునీరు, వసతి, భోజన సౌకర్యం కల్పించారు.

సిర్సనగండ్లలో సీఎండీ ప్రత్యేక పూజలు



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల దేవాలయంలో శుక్రవారం టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రాఘుమారెడ్డి దంపతులు సీతారామచంద్రా స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయంలో ఆయనను సన్మానించారు. వారి వెంట డైరెక్టర్ శ్రీనివాస్, లీలావతి, ధర్మశెట్టి, చంద్రశేఖర్, చారగొండ లైన్‌మన్లు ఉన్నారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న బస్సు

- పసికందు మృతి
- చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తుండగా ఘటన



గట్టు: అంబులెన్స్‌ను బస్సు ఢీ కొన్న సంఘటనలో రెండున్నర నెలల పసికందు మృతి చెందింది. గ్రామస్తుల, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెంచికలపాడుకు చెందిన పవిత్ర, నర్సింహులు దంపతులకు రెండున్నర నెలల క్రితం బిడ్డ పుట్టింది. బిడ్డ అనారోగ్యానికి గురికాగా వైద్యం కోసం ముందుగా అయిజకు తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలుకు బదులుగా పక్కనే కర్ణాటకలోని రాయచూర్ పట్టణానికి తల్లిదండ్రులు ఆ పసికందును అంబులెన్స్‌లో తరలించారు. కాగా యరిగెర క్రాస్ రోడ్డు వద్ద రాయచూర్ నుంచి మంత్రాలయం వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు అంబులెన్స్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలింత పవిత్రతో పాటుగా ఆమెకు తోడుగా వెళ్లిన వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. అసలే అనారోగ్యంతో ఉన్న పసికందు పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో హుటాహుటిన రాయచూర్ ఆస్పత్రికి మరో అంబులెన్స్‌లో తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ పసికందు రాత్రి మృతి చెందినట్లు పెంచికలపాడు గ్రామస్తులు తెలిపారు. పవిత్ర, నర్సింహులకు మొదటి కాన్పులో మగ బిడ్డ పుట్టగా కొద్ది నెలలకే అనారోగ్యంతో మృతి చెందగా, రెండు కాన్పులో బాలిక జన్మించగా, ఇప్పుడు ఇలా రోడ్డు ప్రమాదం కారణంగా మృతి చెందడంతో ఆ దంపతుల రోదనలు అందరికి కంటతడి పెట్టించాయి.